క్లుప్తంగా

దర్గాలో ఫాతెహాలు



ఖాదర్‌లింగస్వామి దర్గా

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోండి



ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

కోసిగి: మండలానికి అదనంగా మంజూరైన మద్యం దుకాణానికి ఈడిగ కులానికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు కోసిగి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి గురువారం తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదిలోగా రూ.2,00,000 లక్షలు డిపాజిట్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 7వ తేదీన కర్నూలులో లాటరీ పద్ధతిలో దుకాణం కేటాయిస్తారన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



చంద్రారెడ్డి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల : మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రారెడ్డి(68) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి హెచ్. కైరవాడి గ్రామానికి చేరుకొని చంద్రారెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రారెడ్డి కుమారుడు మోహన్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి(సంస్థ) బందెనవాజ్ కూడా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌బీ మున్సూర్, భాస్కర్ రెడ్డి, గోవింద్, పద్మనాభం, నదిమూల్లా తదితరులు పాల్గొన్నారు.

కుంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన



రాజగోపురం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈఓ జయరాజు

కౌతాళం : ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో శనివారం నుంచి కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎం.జయరాజ్ ఏర్పాట్లను పరిశీలించారు. రాజగోపురాలపై కలశాల ప్రతిష్ఠాపన కోసం ప్రత్యేక మెట్లు, వేదికలు ఏర్పాటుచేశారు. మెట్ల పటిష్టతను అధికారులతో పరిశీలించారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, మల్లికార్జున, ప్రధాన పూజారి ఈరన్న అర్చకులు పాల్గొన్నారు.

శాకాహారంతోనే జీవచైతన్యం

గోనెగండ్ల : శాకాహారం తినడంతోనే మనిషిలో జీవ చైతన్యం ఉత్తేజ పడుతుందని పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు ఆంజనేయ శర్మ, కంపాడు ఈరన్న అన్నారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలు, యువకులు, మహిళలు శాకాహార ర్యాలీ నిర్వహించారు. జీవహింస మహాపాపం అని, శాకాహారమే ఉత్తమమైన మార్గం అని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం కడపల వీధిలో కడపల రాజు ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీప్రహ్లాద పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్ర ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంగాల రాముడు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

నందవరం : ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సద్వినియోగం చేసుకోవాలని, వలస వెళ్లొద్దని ఎంపీడీఓ పుల్లయ్య, ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వ్యవసాయ, ఉపాధి కూలీలతో ఉపాధి హామీ పథకం అధికారులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని వివరించారు. రోజు వారి కూలీలకు ప్రభుత్వం రూ.300 చెల్లిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పథకాలపై మాట మార్చడం దారుణం

- సూపర్ సిక్స్ అమలుపై చంద్రబాబువి అలివిమాలిన వ్యాఖ్యలు
- పథకాలంటేనే భయమేస్తోందనడం హాస్యాస్పదం
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా పాలన
- మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల అమలుపై సీఎం చంద్రబాబు మాట మార్చడం దారుణమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అంటేనే భయమేస్తోందంటూ నిసిగ్గుగా వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. దమ్ముంటే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమని రాష్ట్ర ప్రజలకు తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. అధికార దాహంతో చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను బురిడీ కొట్టించారని ఆరోపించారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితం అబద్ధాలతోనే సాగిపోయిందని దుయ్యబట్టారు. 2014లో జరిగిన నీరు–చెట్టు పనుల బకాయిలను తన పార్టీ నాయకులు, కార్యకర్తలకు చెల్లించేందుకు సిద్ధ పడ్డ చంద్రబాబు పేదల కోసం సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించకపోవడం గర్హనీయమన్నారు.

అప్పుడు బాదుడని.. ఇప్పుడు వడ్డన..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడంటూ నిరసన తెలిపిన బాబు అధికారంలోకి రాగానే కరెంట్ బిల్లులు పెంచడం విడ్డూరమని ఎమ్మెల్యే అన్నారు. ట్రూఅప్ చార్జీలలో రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై పడిందని వివరించారు. చంద్రబాబు రాజకీయాల కోసం కలియుగ దైవం వేంకటేశ్వరుని సైతం వదలలేదని మండిపడ్డారు. నెయ్యిలో కల్తీ నెయ్యి అంటూ దుష్ప్రచారం చేయడం శోచనీయమన్నారు. హామీలను పక్కదోవ పట్టించేందుకు రోజుకో ఘటన తెరపై తెస్తున్నారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల్లో నిలిపారని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసుకుని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తప్పుడు కేసులు బనాయించడం, హత్యారాజకీయాలు చేయడం బాబు పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. దావోస్ పర్యటనతో రాష్ట్రానికి ఏమీ సాధించుకువచ్చారో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు వివరించాలని కోరారు. చంద్రబాబు పాలనపై ఇప్పటికే ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ భీమారెడ్డి, కోసిగి మండల ఇన్‌చార్జ్ మురళీరెడ్డి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల అధ్యక్షులు యల్లప్ప, హనుమంతురెడ్డి, గౌతమ్, ఉప సర్పంచు వీరనాగుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు ఎక్కడ బాబు?

- అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు
- నేడు హామీలు, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు
- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిటౌన్: ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు ఎక్కడ బాబు అంటూ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు అబద్ధపు, అసాధ్యం కాని హామీలతో ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు హామీలు, ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని, కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. గురువారం సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. అబద్ధాలతో ఎన్ని రోజులు నెట్టుకొస్తారని ప్రశ్నించారు.

జగనన్న పాలనలో ఆదోని అభివృద్ధి

జగనన్న పాలనలో ఆదోనిలో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. బైపాస్ రోడ్డు, మెడికల్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, మైనార్టీలకు ఉర్దూ కాలేజీ, వసతిగృహం, ఈద్గా, ఆరేకల్ వద్ద రెసిడెన్షియల్ వసతి భవనాన్ని నిర్మించామని గుర్తు చేశారు. అభివృద్ధి అంటే ఇది కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు గానూ రూ.30 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నేతల హామీలకు ప్రజలు మోసపోయారని, నేడు నిషితంగా విమర్శలు చేస్తున్నారన్నారు. 2019లోనూ చంద్రబాబునాయుడు లేనిపోని హామీలతో అధికారంలోకి వచ్చారని, ఆ పిమ్మట ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, ఇప్పుడూ అదే చేస్తున్నారన్నారు. అబద్ధాలు చెప్పడమే ఆయన నైజమన్నారు.

చెప్పింది అమలు చేసిన మాజీ సీఎం జగన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏది చెప్పినా కచ్చితంగా అమలు చేసి చూపించారని మాజీ ఎమ్మెల్యే సాయి అన్నారు. కూటమి అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావొస్తోందని, ఆదోనిలో ఏమి చేశారో చూపించాలన్నారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వం నేతల అబద్ధాలు, మోసాలను గమనిస్తున్నారన్నారు. చెప్పేది ఒకటి, చేసేదొకటి అంటూ బహిరంగంగా ప్రశ్నిస్తున్నారన్నారు.

హామీలు అమలు చేయాలి..

ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ డిమాండ్ చేశారు. సచివాలయం వ్యవస్థ, వలంటీర్లకు రూ.10 వేలు వేతనాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు నేడు ఆ వ్యవస్థనే భ్రష్టు పట్టించారని విమర్శించారు. సచివాలయాల్లో అనేక మార్పులు, సవరణలు చేయడం వల్ల సేవలు ప్రజలకు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ పథకానికి రూ.25 లక్షలు జగనన్న ప్రకటించగా, నేడు ఆ పథకాన్నే బాబు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజలకు వైద్యం అందకుండా పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక, గరుసు, లిక్కర్ దందాలకే కూటమి నేతలు పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రజలు ఓపికతో అన్నీ భరిస్తున్నారని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, రాజేశ్వర్‌రెడ్డి, బాలాజీ, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి నారాయణ, వైస్ చైర్మన్ నరసింహులు, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా వంచన

- ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు
- మోసపూరితంగా కూటమి పాలన
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి, వారి ఓట్లతో గద్దెనెక్కిన తరువాత ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలను సీఎం చంద్రబాబునాయుడు వంచన చేస్తూ తన అసలు రూపాన్ని బయటపెట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆరోపించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా మోసపూరితంగా మారిందని, ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలిస్తామంటూ గొప్పలు చెప్పుకొని ఇప్పుడు ఆ హామీలను అమలు చేయాలంటే భయమేస్తుందనే దుస్థితికి కూటమి ప్రభుత్వం దిగజారిందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు ఇవ్వలేమని, ఉద్యోగాలు కల్పించలేమని, అభివృద్ధికి డబ్బులేవంటూ ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడుకే చెల్లిందన్నారు. దేశవ్యాప్తంగా కరోనాతో అన్ని రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రరాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతో ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. కరోనా కాలంలో రెండేళ్ల పాటు రాష్ట్రానికి ఆదాయం పడిపోయినా ప్రజలు ఆదుకోవాలనే సంకల్పంతో సంక్షేమ పథకాలు కొనసాగించి దేశం మొత్తం మెచ్చుకునేలా సువర్ణపరిపాలన కొనసగించారన్నారు. జగనన్న పాలనలో అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా, చేదోడు ఇలా ఎన్నో పథకాలను కోట్లాది మంది ప్రజలకు లబ్ధిచేకూర్చారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు నెలలు గడిచినా ప్రజల జీవన ప్రమాణాలు దిగజార్చారన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్య బలోపేతానికి చర్యలు

వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్యాన్ని బలోపేతం చేసేందుకు నాడు నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేశారని, అదేవిధంగా 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించారని బుట్టా రేణుక అన్నారు. ప్రస్తుతం ఆయా మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించే కుట్రను కూటమి ప్రభుత్వం ఒడిగడుతోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థద్వారా లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ సచివాలయ ఉద్యోగులకు తొలగించేందుకు పూనుకొందని ఆరోపించారు. ఇసుకు, మద్యం, మైనింగ్ మాఫియానూ ప్రోత్సహిస్తూ ప్రజల హక్కులను కబలించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజలకోసం తమ పార్టీ పోరాటాలు చేసి వారికి అండగా నిలుస్తుందన్నారు.

వైభవంగా గోపుర కలశ పూజలు





కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న పద్మశాలి మహిళలు, హోమాలు చేస్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో నూతన గర్భగుడి గోపుర, ముఖద్వారం, గోపుర శిఖర కలశ స్థాపన పూజలు ప్రారంభమైయ్యాయి. గురువారం వేకువ జామున నుంచి ఆలయంలో వేదపండితులు గరుడాద్రి వెంకట సుబ్బయ్య శాస్త్రి నేతృత్వంలో పద్మశాలి కులబాంధవుల ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు గావించి మహామంగళ హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు కలశాలు, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పుట్టమట్టిని సేకరించి ఆలయం చెంతకు చేరుకుని నూతన వస్త్రాలు ధరించి వేదపండితుల ఆధ్వర్యంలో హోమాలు చేపట్టారు. సాయంత్రం జలాధివాసము, హోమాము చేపట్టారు. శుక్ర, శని వారాల్లో ప్రత్యేక పూజలు చేపట్టి 2న గోపుర శిఖర కలశ స్థాపన కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: రోడ్డు భద్రతా నియమాలపై అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ×రోడ్డు సేఫ్టీ కమిటీ డివిజనల్ లెవెల్ మీటింగ్ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు రోడ్డు సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టూవీలర్ వాహనాల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్లపైకి వాహనాలతో వచ్చే వారు కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుని వాహనాలను నడపాలన్నారు. సమావేశంలో ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, ఆర్టీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సిసిరాదీప్తి, ఉపేంద్ర, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ సత్యవతి పాల్గొన్నారు.

పట్టణంలో కమిషనర్ పర్యటన

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ గురువారం పట్టణంలోని సందు సందునా, వీధి వీధిన కలియ తిరిగారు. ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అరుంజ్యోతినగర్, ఎంఐజీ, ఎల్‌ఐజీ, హెచ్‌ఐజీ, ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, అంబేడ్కర్‌నగర్, అరుంజ్యోతినగర్, కొత్త బస్టాండు, ఆర్టీసీ కాలనీ, బార్‌పేట, ఆర్కేడీ స్కూల్, వైఎంకే నగర్, టీజీఎల్ కాలనీ, ఇందిరా భవన్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. తెల్లవారక ముందే వీధుల్లోకి వెళ్లి శానిటేషన్ పనులను పరిశీలించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి బోండాలు తదితర వాటిని ఎత్తివేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని శానిటేషన్ అధికారులకు సూచించారు.

కుష్టువ్యాధిపై అవగాహన కల్పించాలి



కోసిగి పంచాయతీ కార్యాలయం ఎదుట అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కోసిగి: కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు అభిరూప్, సి. రజిత సూచించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ముందుగా మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెల్త్, పంచాయతీ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేసి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ స్పర్శలేని మచ్చ, ముఖము, చెవులు, ఎద, వీపు మీద నొప్పులేని బుడిపెలు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవుట, ముక్కుదూలం అణిగిపోవుట, శ్వాస ఆడకపోవుట, బొటనవ్రేలు, చిటికెన వ్రేలు, మణికట్టు పనిచేయకపోవుట, పాదాలు, చేతులు బొబ్బలు రావడం వంటివి కుష్టువ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలోసీహెచ్‌ఓ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్‌వైజర్స్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్య సిబ్బంది గురువారం కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రుక్సానా మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఉంటుందని, ఇందుకోసం ప్రతి రోజు స్పర్శ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధిని గుర్తించి తగిన చికిత్స అందిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ హనుమంతు, ఎంపీహెచ్ఎస్ పరమేశప్ప, భారతి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల: మండలంలో బీసీ, ఈబీసీ, కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) కులములకు చెందిన లబ్ధిదారులు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూపై కులములకు చెందిన లబ్ధిదారులకు బ్యాంకు అనుసంధానముతో సబ్సిడీ రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 07వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు

గోనెగండ్ల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగి ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ మణి మంజరి తెలిపారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలోని పెద్దమరివీడు రోడ్డులో జరుగుతున్న కాలువలో పూడికతీత పనులను ఎంపీడీఓ తనిఖీ చేశారు. మస్టర్లు తనిఖీ చేసి జరుగుతున్న పనుల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన కొలతల ఆధారంగా పనులు చేసుకుంటే కూలీ పడుతుందని కూలీలకు చెప్పారు. వలసలు వెల్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు.

భావితరాలకు గాంధీజీ స్ఫూర్తిదాయకం



గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం : జాతిపిత మహాత్మ గాంధీజీ భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాంపురంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ భీమారెడ్డి, కోసిగి మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

ఆదోని అర్బన్: ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) ఆధ్వర్యంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. అవోపా పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పార్కులోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవాకార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్నశెట్టి, కోశాధికారి యాదగిరి వెంకటేశ్వర్లు, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, సభ్యులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: మానవహక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, జిల్లా కో ఆర్డినేటర్ గోవిందు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆదోని డీఎస్పీ ఎం.హేమలత అన్నారు. ఈ మేరకు గురువారం ×జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు–2025లో భాగంగా డీఎస్పీ జెండా ఊపి ఆటో ర్యాలీని ప్రాంభించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి పోలీసు కంట్రోల్ రూమ్, భీమా సర్కిల్, గవర్నమెంట్ ఆసుపత్రి మీదుగా తిరిగి ఆర్టీసీ బస్టాండు వరకు ఆటో ర్యాలీ సాగింది. డీఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణించేటప్పుడు టూవీలర్ వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు, రూరల్ సీఐ నల్లప్ప, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

స్పీడు బ్రేకర్లు, రేడియం ఇండికేటర్స్ వేయాలి

ఆదోని అర్బన్: పట్టణ శివార్లలో స్పీడు బ్రేకర్లు, రేడియం ఇండికేటర్స్ వేయాలని డీఎస్పీ హేమలత ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను కోరారు. బసవేశ్వర సర్కిల్, ఆస్పరి బైపాస్ రోడ్డు, లక్ష్మమ్మవ్వ సర్కిల్, సిరుగుప్ప సర్కిల్, టౌన్‌లో కొన్ని ముఖ్యమైన పాయింట్ల వద్ద స్పీడు బ్రేకర్లు, రేడియం ఇండికేటర్స్ వేయాలని, సైన్ బోర్డ్స్, జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రూరల్‌సీఐ నల్లప్ప, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు ఉన్నారు.

విద్యాసంస్థల బస్సులపై నిఘా పెట్టండి

ఆదోని అర్బన్: పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షులు బసాపురం లింగప్ప, పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. గురువారం ఆదోని ఎంవీఐ సిసిరాదీప్తిని కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ కొన్ని ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను పరిమితికి మించి బస్సుల్లో తరలిస్తున్నారన్నారు.

ఇళ్ల పట్టాలపై విచారణ

నందవరం : మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో ఇంటి పట్టాలపై తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలో గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను కొంత మంది అక్రమించుకున్నట్లు గుర్తించి, వాటిని ఖాళీ చేయాలని 60 మందికి నోటీసులు జారీ చేశారు. లే అవుట్ పరిశీలించి అక్రమదారులకు వారం రోజులు గడులోపు స్థలాలను ఖాళీ చేయాలని సూచించారు. నిజమైన లబ్ధిదారులకు ఇంటి స్థలం కేటాయించి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న తహసీల్దారు శ్రీనాథ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా వాటిని పరిష్కరించకుండా తహసీల్దార్ కాలయాపన చేస్తున్నాడన్నారు. ఆర్ఐ, విలేజ్ సర్వేయర్లు, విఆర్‌ఓలు కూడా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ, నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఆందోళన

ఎమ్మిగనూరుటౌన్: కార్మిక వర్గానికి నష్టం కలిగించే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్ బిల్లుపై కార్మిక, కర్షక వర్గాలతో కలిసి ఆందోళన ఉధృతం చేసేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఆమోదింపజేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బిల్లును పెడుతున్నందున ఫిబ్రవరి 5వ తేదీన ఆ లేబర్ కోడ్ బిల్లు ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు.

మిరప రైతులకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి

ఆదోని రూరల్: మిరప రైతులకు పంటల బీమా పరిహారం ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని హాన్వాల్ గ్రామంలో కడ్డీ బ్యాడిగి మిరప కాయలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాభావం వల్ల పంట పూర్తిగా దెబ్బతిందని, రైతులు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. కానీ ఎకరాకు రూ.50 వేలు కూడా ఆదాయం వచ్చే అవకాశం లేదన్నారు. పండించిన మిరప పంటకు క్వింటా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు కనీస మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, సీఐటీయూ మండల కార్యదర్శి వీరారెడ్డి పాల్గొన్నారు.